ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 20 జూన్ 2024







నేడు కేంద్ర బృందం క్షేత్రస్థాయి పర్యటన
రబీ పంటనష్టం.. కరువు కష్టాల పరిశీలన
మాళాపురం.. గూళ్యపాలెం రైతులతో ముఖాముఖి

రండి.. మా కష్టాలు చూడండి..!

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

కరువు పరిస్థితిని క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం వచ్చింది. రబీ సీజన్‌లో వర్షాభావం కారణంగా వివిధరకాల పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం జిల్లాలో 37,195 హెక్టార్లల్లో రూ.36.86 కోట్ల విలువైన పంటను రైతులు కోల్పోయారు. ఇందులో అత్యధికంగా 34,303 హెక్టార్లల్లో పప్పుశనగ పంట దెబ్బతింది. దీని విలువ రూ.34.30 కోట్లు. ఇది కాకుండా మినుము, పెసర, ఉలవ, జొన్న, నువ్వులు, తెల్లకుసుమ, పొద్దుతిరుగుడు, అలసంద, కొర్ర తదితర పంటలు దెబ్బతిన్నాయి. అనధికారికంగా నష్టం మరింత ఎక్కువగా ఉందని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. విడపనకల్లు, యాడికి మండలాలలో పత్తి పంట నష్టం జరిగినా.. జాబితాలో చేర్చలేదు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో గణాంకాలను కేంద్రం కోత పెట్టి సాయం అందిస్తుంది. పంటనష్టాన్ని సరిగా అంచనా వేయకుండా, అరకొర వివరాలతో కేంద్రానికి నివేదిక ఇస్తే రైతులకు అన్యాయం జరుగుతుంది. అలాకాకుండా కొత్త ప్రభుత్వం చొరవచూపాలని రైతులు కోరుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

నేడు క్షేత్రస్థాయి పర్యటన

రబీ పంటనష్టం, పశుసంపద, తాగునీరు, కరువు కష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఐఏఎస్ రితీష్ చౌహాన్ నేతృత్వంలో బృందం సిద్ధమైంది. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్, సభ్యులు పొన్నుస్వామి, సునీల్ దూబే గురువారం క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళతారు. అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరుతారు. మొదట విడపనకల్లు మండలం మాళాపురం గ్రామానికి వెళ్లి కరువు ప్రభావిత పొలాలను పరిశీలిస్తారు. స్థానిక రైతులతో మాట్లాడి.. రబీ పంటనష్టం గురించి తెలుసుకుంటారు. వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి 11.10 గంటలకు చేరుకుని, స్థానిక రైతులతో మాట్లాడుతారు.



గొర్రెలకు వదిలేశా..

రబీలో 2.78 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాను. వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేదిలేక గొర్రెలకు వదిలేశాను. అప్పు చేసి రూ.25 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయాను. కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పంటనష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- లక్ష్మీనారాయణ, యాడికి



పప్పుశనగ ఎండిపోయింది..

రబీలో 30 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. ఎకరానికి రూ.20 వేలు చొప్పున రూ.6 లక్షల దాకా పెట్టుబడి ఖర్చు వచ్చింది. విత్తనం వేసిన తర్వాత వర్షాభావంతో పంట నిలువునా ఎండిపోయింది. ఎకరానికి కేవలం ఒక క్వింటం దిగుబడి వచ్చింది. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- జగదీష్, ఎన్.కొత్తపల్లి, యాడికి మండలం




యాడికిలో వర్షాభావంతో వాడుపట్టిన పత్తి పంట



ఐదెకరాలకు క్వింటం వచ్చింది..

రబీలో ఐదెకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. రూ.లక్ష దాకా పెట్టుబడికి ఖర్చు చేశాను. వర్షాభావంతో పంట దెబ్బతింది. ఐదెకరాలకు ఒక క్వింటం దిగుబడి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకుంటే మాకు ఊరట కలుగుతుంది.

- బలరాం, విడపనకల్లు



యాడికిలో వర్షాభావంతో ఎదుగుదల లేని జొన్న పంట



క్వింటం కూడా రాలేదు

రబీలో 20 ఎకరాలు కౌలుకు తీసుకొని పప్పుశనగ సాగు చేశాను. ఎకరానికి రూ.20 వేలు చొప్పున రూ.4 లక్షలదాకా ఖర్చు వచ్చింది. ఎకరానికి క్వింటం కూడా దిగుబడి రాలేదు. అప్పు చేసి పెట్టుబడి పెట్టాను. వానలు పడకపోవడంతో పూర్తిగా నష్టపోయాం.

- చిక్కన్నయ్య, విడపనకల్లు

పత్తి వర్షార్పణం

జిల్లాలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం పర్యటిస్తోంది. వ్యవసాయ శాఖ సమర్పించిన నివేదిక ఆధారంగా.. క్షేత్రస్థాయి నష్టాన్ని తెలుసుకునేందుకు రైతులతో గురువారం మాట్లాడనుంది. అప్పటి నష్టాన్ని చూపించేందుకు పొలాల్లో రబీ పంటలు లేవు. ఖరీఫ్ సాగుకు సేద్యాలు చేశారు. కొందరు ఇప్పటికే విత్తనం వేశారు. కానీ పత్తి పంట మాత్రం ఇప్పటికీ పొలాల్లోనే ఉంది. నష్టం జాబితాలో దీన్ని చూపించలేదు. నైరుతి వర్షాల కారణంగా పత్తి చేలల్లో నీరు నిలిచింది. పంట కుళ్లిపోతోంది. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి దృశ్యాలను కేంద్ర బృందానికి అధికారులు చూపించగలిగితే.. రైతులకు మేలు జరుగుతుంది.

పొలాల్లో నిలిచిన నీరు
కుళ్లిపోతున్న పత్తి పంట
చేతికొచ్చే సమయంలో విపత్తు

బొమ్మనహాళ్, జూన్ 19: మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో పత్తి సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో దిగుబడిచేతికి అందకుండాపోయింది. పంట నీట మునిగి.. రైతులను నట్టేట ముంచింది. బోర్ల కింద సాగుచేసిన పత్తిపంట చేతికి వచ్చే సమయంలో వర్షపునీరు నిలబడి మొక్కలు నిలువునా కుళ్లిపోయాయి. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట, ఉప్పరహాళ్, గోనూరు, రంగాపురం క్యాంప్ తదితర గ్రామాలలో పత్తి పంట సాగుచేశారు. వరుసగా వర్షం కురుస్తుండడంతో పొలాల్లో నీరు నిలబడి మొక్కలు కుళ్లిపోయాయి. ఈదురు గాలులకు విరిగిపడి పత్తికాయలు రాలిపోయాయి. ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేని పరిస్థితి ఉందని, పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల ప్రకారం పెట్టుబడి పెట్టామని, కనీసం ఎకరాకు 12 క్వింటాళ్లు అయినా దిగుబడి వస్తే బాగుండేదని రైతులు చెబుతున్నారు. సమీపంలో ఉన్న బళ్లారి మార్కెట్ వచ్చిన పత్తిని తీసుకెళ్తే చాలా అధ్వానంగా అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది ఎకరాల్లో సాగుచేశా..



వ్యవసాయ బోర్ల కింద 10 ఎకరాల్లో పత్తిపంట సాగుచేశాను. పంట దిగుబడి బాగా వస్తే పిల్లలను బాగా చదివించాలనుకున్నా. రెండేళ్ల క్రితం కొడుకు చదువు మానేశాడు. ఇంకా ఇద్దరు ఆడపిల్లలనైనా బాగా చదివించాలని ఆశపడ్డాను. 10 ఎకరాల్లో పత్తి పంట పెడితే ఎకరాకు నాలుగు క్వింటాలు కూడా రాలేని పరిస్థితి. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. ఈ వర్షం వల్ల పత్తిపొలంలోకి భారీగా నీరు చేరి మొక్కలే కుళ్లిపోయి పత్తి నల్లగా మారిపోయింది. పెట్టుబడి సొమ్ము కూడా రాలేని పరిస్థితుల్లో అప్పులు తీర్చుకోవాలో.. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలో దిక్కుతోచని పరిస్థితి.

- హనుమంతు, ఉప్పరహాళ్

ఐదెకరాల పంట పోయినట్లే..

ఐదెకరాల్లో వ్యవసాయ బోర్ల కింద పత్తిపంట సాగుచేశాను. వర్షం కురవడంతో పొలంలోకి నీరు భారీగా చేరింది. మొక్కలు విరిగిపడి కుళ్లిపోయి పత్తికాయలు నీళ్లలో కుళ్లిపోయాయి. దీంతో పెట్టిన పెట్టుబడి అందే పరిస్థితి లేదు. ఎకరాకు రూ. 30 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. రసాయనిక మందులు, ఎరువులకే అధికంగా ఖర్చు అయింది. ప్రస్తుతం ఎకరాకు మూడు క్వింటాలు కూడా రాలేని పరిస్థితి. మార్కెట్‌లో రూ.6000 నుంచి రూ. 6500 వరకు పలుకుతుందని దళారులు చెబుతున్నారు. ఎకరాకు కనీసం 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తిపంట దిగుబడి వస్తే రైతుకు గిట్టుబాటు ఉంటుంది.

- వెంకటేశులు, గోనూరు



లింగదహాళ్ వద్ద పత్తిపంటలో భారీగా చేరిన వర్షపునీరు(ఫైల్)



నేను దొంగనని నిరూపించండి..!

పది రోజులు టైం ఇస్తున్నా.. వదిలేది లేదు
ఎస్పీ, డీటీసీ ఆఫీస్ ఎదుట కూర్చుంటాం
మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి వార్నింగ్



విలేకరుల సమావేశంలో జేసీ ప్రభాకర్ రెడ్డి

అనంతపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో మా కుటుంబాన్ని వేధించారు. దొంగ బస్సులు తెచ్చామని కేసులు పెట్టారు. అధికారులకు పది రోజులు గడువు ఇస్తున్నా. నేను దొంగనని నిరూపించాలి. లేదంటే ఎస్పీ ఆఫీస్ వద్ద నా కొడుకు, కోడలు.. డీటీసీ ఆఫీస్ వద్ద నేను, నా భార్య కూర్చుంటాం' అని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో తన కుటుంబానికి జరిగిన అన్యాయం గురించి వివరిస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పేర్నినానిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'వైసీపీ ప్రభుత్వంలో నా కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగింది. మమ్మల్ని దొంగోళ్లను చేశారు. నాతోపాటు నా భార్య, కొడుకు, కోడళ్లపై కేసులు పెట్టారు. నన్ను, నా కొడుకును జైలుకు పంపించారు. మేము కొనుగోలు చేసిన వాహనాలకు చెక్కుల రూపంలో డబ్బులు చెల్లించాము. జీఎస్టీ కట్టాము. అయినా మాపై అక్రమ కేసులు పెట్టారు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పెద్ద ఒత్తిడితో అర్ధరాత్రి దొంగలను పట్టుకుపోయినట్లు తనను, తన కుమారుడిని అరెస్టు చేశారని, వారి పేర్లను ఆ రోజే రాసుకున్నానని అన్నారు. జరిమానాతో వదిలేయాల్సిన చోట కక్ష పూరితంగా వ్యవహరించారని, అప్పటి ఐపీఎస్ అధికారి సీతారామాంజినేయులు, అప్పటి మంత్రి పేర్ని నాని, రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు అధికారి ప్రసాద్ రావు, అనంతపురం డీటీసీ శివరాంప్రసాద్ దీనికి కారణమని అన్నారు. తన బస్సులను సీజ్ చేసి ఆర్టీఏ ఇన్‌స్పెక్టర్లను వదిలే ప్రసక్తే లేదని అన్నారు. సీజ్ చేసిన బస్సులన్నీ తుప్పుపట్టాయని, మరో మూడు బస్సులను వైసీపీ శ్రేణులు తగులబెట్టాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందని ఆరోపించారు. పోలింగ్ తర్వాత తాడిపత్రిలో జరిగిన ఘటనలో టీడీపీ కార్యకర్తలపై రౌడీ షీట్ ఎలా ఓపెన్ చేస్తారని ఎస్పీని ప్రశ్నించారు. తుప్పుపట్టిన తన బస్సులను రిపేర్ చేయించాలని సీజ్ చేసిన అధికారులను హెచ్చరించారు. 2019 నుంచి తన నియోజకవర్గంలో ఏమేం జరిగాయో అన్నింటికీ జవాబు చెబుతానని అన్నారు. తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నా.. మున్సిపల్ ఆఫీస్‌లోనే తాను భోజనం చేసేలా.. స్నానం చేసేలా.. బాత్ రూంకు వెళ్లేలా చేసింది మర్చిపోలేదని అన్నారు. అప్పుడు పనిచేసిన కమిషనర్లను ఏ ఒక్కరినీ వదిలేది లేదని అన్నారు.

కేదార్‌నాథ్ ఆలయం వద్ద నృత్యం చేస్తున్న విద్యార్థులు



నాట్య మయూరాలు

వణికించే చలిలో అద్భుత ప్రదర్శన.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాల వద్ద అద్భుత నృత్య ప్రదర్శనతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు తాడిపత్రి బాలికలు. మే 13, 15 తేదీల్లో మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలో దాదాపు గంటన్నరపాటు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. తాడిపత్రికి చెందిన వందన డ్యాన్స్ అకాడమి విద్యార్థినులు సాయిమైత్రి, జోషిత, వర్ధిని, నవ్యశ్రీ, సాహిత్య, నిహారిక బృందం అద్భుత ప్రదర్శనకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. కేదార్‌నాథ్ క్షేత్రానికి 25 కి.మీ. కాలినడకన వెళ్లి ఆలయం వద్ద దాదాపు గంటన్నరపాటు వీరు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఏప్రిల్ 23 నుంచి మే 15 వరకు వివిధ పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చామని శిక్షకులు ప్రవీణ్, వందన తెలిపారు. తిరుపతి, కేరళ, ద్వారకానాథ్, గుజరాత్, అయోధ్య, ఆగ్రా, హరిద్వార్, అక్షరధామ్ తదితర ఆలయాల వద్ద తమ విద్యార్థులు నృత్య ప్రదర్శన ఇచ్చారని అన్నారు.

- తాడిపత్రి టౌన్



కేదార్‌నాథ్ ఆలయం వద్ద విద్యార్థులు

పరిజ్ఞానం లేకుండా డ్యాం గేట్లు విరిచారు

తోపుదుర్తిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్



గేట్లు పాడవ్వడానికి కారణాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూన్ 19: లక్ష ఎకరాలకు నీరందిస్తామని చెప్పి.. కనీస పరిజ్ఞానం లేకుండా పేరూరు డ్యాం గేట్లు విరగొట్టారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టును అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టు వరకు నిర్మించే పరిటాల రవీంద్ర సాగునీటి కాలువతోపాటు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను సందర్శించారు. అప్పట్లో రూ.805 కోట్లతో చేపట్టే పనులకు సీఎం చంద్రబాబు శిలాఫలకాలను ఆవిష్కరించారని అన్నారు. విరిగిన ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటితో పేరూరు ప్రాజెక్టు నిండితే ప్రకాశ్ రెడ్డి అత్యుత్సాహం చూపించారని, పరిజ్ఞానంలేకుండా 5, 8 గేట్లను విరగ్గొట్టారని విమర్శించారు. ఆరో గేటు చైన్‌లింక్స్ దెబ్బతిన్నాయని, మొత్తం 8 గేట్లు సరిగా పనిచేయడంలేదని అన్నారు. టీడీపీ హయాంలో జైకా నిధులు రూ.22 కోట్లు మంజూరయ్యాయని, ఆ తరువాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వానికి అభివృద్ధి చేయడం చేతకాలేదని ఆమె విమర్శించారు. త్వరలోనే ప్రాజెక్టుకు నీరు అందించే పనులు ప్రారంభమౌతాయని తెలిపారు. కాగా, పేరూరు డ్యాం మోటార్లు, స్టార్టర్లు, వైరింగ్, లిగ్‌మెంట్స్ మరమతులు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు ఆమె దృష్టికి తెచ్చారు. మరమ్మతులకోసం రూ.126 కోట్లతో అంచనాలు తయారు వేసి ప్రభుత్వ అనుమతుల కోసం పంపుతున్నామని తెలిపారు.



సేద్యం.. యుద్ధం

ఎన్ని కష్టాలు ఎదురైనా అన్నదాతలు సేద్యాన్ని వదలడం లేదు. ఎద్దులు దూరమైనా.. కన్న కొడుకుల భుజాలపై కాడెమాను మోపుతున్నారు. చదువుకుంటున్న పసివారు.. తండ్రికి తోడుగా పొలంలోకి దిగారు. ఇంటిల్లిపాదీ కష్టపడితేగాని అనంతలో వ్యవసాయం ముందుకు సాగదు. కంబదూరు మండలం నూతిమడుగు రైతు సర్దానప్పకు మూడు ఎకరాల పొలం ఉంది. ఇందులో టమోటా సాగు చేశాడు. కలుపు తీత పనులకు కూలీల ఖర్చులు భరించలేక.. తన ఇద్దరు కొడుకులను పొలంలోకి దించాడు. ఎద్దులు లాగాల్సిన గుంటకను వారిచేత లాగించారు. పదో తరగతి చదువుతున్న రాణా ప్రతాప్, ఇంటర్ చదువుతున్న కార్తీక్.. పొలం బాట పట్టడం రైతుల కష్టాలను కళ్లకు కడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వారికి ఆపన్న హస్తం అందించారు. సేద్యానికి అయ్యే ఖర్చులను, ఇద్దరి చదువుల ఖర్చులను తాను భరిస్తానని మాటిచ్చారు. గ్రామానికి వెళ్లి వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకోవాలని టీడీపీ నాయకులను పురమాయించారు.

- కళ్యాణదుర్గం



కేంద్ర బృందానికి ఏకరువు..!



కలెక్టరేట్‌లో పంటనష్టంపై సమీక్షిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

- కరువు బృందానికి జిల్లా కష్టాలు చూపిన కలెక్టర్
- ఫొటోలు, వీడియోలతో వివరించిన అధికారులు
- గతేడాది జిల్లాలో రూ.56 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా

అనంతపురం టౌన్, జూన్ 19: అనంత కరువుపై జిల్లా అధికారులు కేంద్రబృందం ఎదుట ఏకరువు పెట్టారు. గతేడాది రబీసీజన్ సమయంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా 14 మండలాల్లో జరిగిన నష్టంపై ఫొటోలు ప్రదర్శిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్, వ్యవసాయశాఖ, భూగర్భజలశాఖ, పశుసంవర్థక శాఖ తదితర శాఖల అధికారులు వివరించారు. బుధవారం కేంద్రకరువు బృందం అధ్యయనకమిటీ టీమ్‌లీడర్ రితీష్ చౌహాన్, సభ్యులు ఐఏఎస్ చిన్మయ్ పుండ్లిక్‌రావ్ గోత్మారే, ఐఏఎస్ కూర్మనాథ్‌ల సమక్షంలో కరువుపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గతేడాది 319.6 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 247.4 మి.మీ వర్షం కురిసిందన్నారు. దేశంలో జైసల్మీర్ తర్వాత అతి తక్కువ వర్షపాతం జిల్లాలో నమోదవుతుందన్నారు. 2023లో వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భజలాలు ఈఏడాది మేనాటికి 15.22 మీటర్ల లోతుకు వెళ్లాయన్నారు. తక్కువ వర్షపాతం వల్ల తుంగభద్ర కెనాల్‌నుంచి 32.5 టీఎంసీల నీటిని కేటాయించినా కేవలం 16,071 టీఎంసీల నీరు మాత్రమే విడుదల చేశారన్నారు. జిల్లాలో రబీ వ్యవసాయ విస్తీర్ణం 1,23,185 హెక్టార్లు ఉండగా గతేడాది తీవ్ర కరువు వల్ల 50నుంచి 70 శాతం పంట దెబ్బ తినిందన్నారు. 14మండలాల్లో 39,694 మంది రైతులకు సంబంధించి 53,014 హెక్టార్లకు రూ45,06 కోట్ల పంటనష్ట పరిహారానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో 2,256 చేతిపంపులు ఎండిపోయాయని, ఉపాధి పనులు ఆగిపోయాయన్నారు. పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ సేనీలదూబే, డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఆశిష్‌పాండే, రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ అరవిందకుమార్ సోనీ, ఏపీఎస్టీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగరాజు, గ్రౌండ్‌వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.



పంట నష్టాన్ని వివరిస్తున్న వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ

నివేదిక అందజేశాం : కలెక్టర్

జిల్లాలో రబీలో జరిగిన నష్టంపై కేంద్ర బృందానికి నివేదిక అందజేశామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. అధికారులతో సమీక్ష అనంతరం విలేకులతో మాట్లాడిన కలెక్టర్ గతేడాది వర్షాభావం కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం వచ్చిందన్నారు. జిల్లాలో పంటనష్టాలు, పశువులకు గడ్డితిప్పలు, తాగునీటి ఇబ్బందులు తదితర వాటిని కూలంకుశంగా వివరించామన్నారు. బోర్లు ఎండిపోవడంతో రైతులు పడిన కష్టాలను అధికారులకు తెలియజేశామన్నారురు. అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల కరువుపై అధికారులు చర్చించారన్నారు. అనంత జిల్లాలో 14మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. ఇక్కడి కరువు పరిస్థితులను కళ్లారా చూపించామన్నారు. జిల్లాలో మరో రెండు రోజులు కేంద్ర బృందం పలు గ్రామాల్లో పర్యటించి, స్వయంగా నష్టాన్ని పరిశీలిస్తుందన్నారు. పూర్తి నష్టంపై కేంద్రానికి నివేదిక అందజేస్తారన్నారు.

సంక్షేమ పథకాలకు కొత్త పేర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్19 : ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో అమలయ్యే పలు సంక్షేమ పథకాలకు కొత్త పేర్లను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలైన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ విద్యోన్నతి, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహాల పేర్లను మారుస్తూ ఆ శాఖ రాష్ట్ర అధికారులు జీఓ నంబర్ 4ను విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ శాఖ జేడీ మధుసూదన్‌రావు బుధవారం వెల్లడించారు.

వైసీపీ ప్రభుత్వంలో పథకాల పేర్లు	కూటమి ప్రభుత్వంలో పథకాల పేర్లు
జగనన్న విద్యాదీవెన	పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజ్)
జగనన్న వసతి దీవెన	పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ (మెయింటెనెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజ్)
జగనన్న విదేశీ విద్యదీవెన	అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి
వైఎస్ఆర్ కళ్యాణమస్తు	చంద్రన్న పెళ్లికానుక
వైఎస్ఆర్ విద్యోన్నతి	ఎన్టీఆర్ విద్యోన్నతి
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం	ఇన్సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురంరూరల్, జూన్ 19: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 457 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

అమిగోస్..ఖజానాకు.. లాస్..!





అమిగోస్ కార్యాలయం

- ఏడాదికి రూ.130 కోట్లకు లీజు
- రూ.65 కోట్లతో సరిపెట్టిన అమిగోస్ మినరల్స్
- లీజుదారులకు బెదిరింపులు
- వైసీపీ పెద్దల అండదండలతో రెచ్చిపోయిన వైనం
- తాజాగా ప్రధాన రికార్డుల తరలింపు దుమారం



భూగర్భ గనుల శాఖ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: జిల్లాలో ఖనిజ సంపదను కొల్లగొడుతున్న అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు మొత్తాన్ని ఎగ్గొట్టేందుకు పక్కా స్కెచ్ వేసింది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ఖనిజ సంపద తవ్వకాలు, రవాణాకు సంబంధించి తిరుపతికి చెందిన అమిగోస్ మినరల్స్ సంస్థ రెండేళ్లకు రూ.260కోట్లకు లీజు అగ్రిమెంట్ చేసుకుంది. అయితే ప్రభుత్వానికి ఒక్క పైసా చెల్లించకుండానే ముందస్తుగా లీజుకు ఇచ్చేశారు. ఏడాది గడిచినా సవంత్సరానికి చెల్లించాల్సిన రూ.130కోట్లు చెల్లించకుండా కాలం వెల్లబుస్తున్నారు. దీంతో జిల్లా మైన్స్ అధికారి అమిగోస్ సంస్థ ఏడాది లీజు మొత్తాన్ని చెల్లించాలని ఇటు అమిగోస్ సంస్థకు, అటు మైన్స్ రాష్ట్ర డైరెక్టర్‌కు అప్పట్లో లేఖ పంపారు. అమిగోస్ మినరల్స్ ఏడాది మొత్తాన్ని చెల్లించకుంటే లీజు రద్దుతో పాటు నాలుగేళ్ల పాటు ఆ సంస్థ ఎక్కడా మైనింగ్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర మైన్స్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసి అప్పట్లో చేతులు దులుపుకున్నారు. ఆ పరిస్థితుల్లో తమకు ఉన్న పలుకుబడితో అమిగోస్ సంస్థ ఎండీ... అప్పటి సీఎం, పెద్దమంత్రి దృష్టికి తీసుకెళ్ళి మైన్స్ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలను తొక్కిపెట్టేశారు. దీంతో చేసేది లేక మైన్స్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా అధికారులు అప్పట్లో మిన్నకుండిపోయారు. పైగా లీజు మొత్తాన్ని చెల్లించకుండా, స్థానికంగా లీజు దారుల నుంచి సుమారు జిల్లాలో రూ.100కోట్ల వరకు అక్రమ వసూళ్ల చేసినట్లు సమాచారం. లీజుదారుల నుంచి వసూలు చేసిన అమిగోస్ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి లీజు మొత్తాన్ని ఎందుకు చెల్లించడం లేదనేది అందరిలోనూ తలెత్తుతున్న ప్రశ్న. కరవు జిల్లాలో లభించే నాణ్యమైన ఖనిజాన్ని విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టి, అక్రమంగా అనుమతి లేని ప్రాంతాలకు తరలించడంతో జిల్లాకు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడడం ఖాయం. ఈ పరిస్థితుల్లో తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ రహస్యంగా ప్రధాన రికార్డులు, ఫైల్స్ తరలింపు ఘటన వెలుగులోకి వచ్చింది. దీంతో స్పందించిన మైన్స్ అధికారులు రికార్డుల తరలింపును అడ్డుకుని అమిగోస్ ఆగడాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వ యంత్రాంగం అమిగోస్ సంస్థపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఏడాదికి రూ.130 కోట్లకు లీజు

ఉమ్మడి జిల్లాలో లభించే ఖనిజ సంపద ఆధారంగా నెలకు రూ.11కోట్లతో ఏడాదికి రూ.130కోట్లతో అమిగోస్ మినరల్స్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. జిల్లాలో మాత్రం నెలకు రూ.20-30 కోట్ల వరకు ఖనిజ సంపదతో ప్రభుత్వానికి ఇదివరకు ఆదాయం వచ్చేదని చెబుతున్నారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి, పెద్దమంత్రికి అత్యంత సమీప బంధువు కావడంతోనే అమిగోస్ సంస్థకు బినామీ పేర్లతో లీజుకు ఇచ్చారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. పైగా వచ్చే ఆదాయంలో అప్పటి సీఎంకు, అప్పటి పెద్దమంత్రికి సైతం వాటాలు ఉన్నట్లు ఆశాఖలో చర్చించుకుంటున్నారు. అంతేగాక ఇదివరకు లీజు పొందిన కాంట్రాక్టర్లు సైతం ఇదే విషయాన్ని గట్టిగానే ఆశాఖ అధికారుల ఎదుటే వాదిస్తున్నారు. ఏది ఏమైనా జిల్లాలో లభించే ఖనిజ సంపదను రాయల్టీ పేరుతో జిల్లా అభివృద్ధికే వినియోగించాలనేది లీజు కాంట్రాక్టర్లకు ఇచ్చే అగ్రిమెంట్‌లోనే ఉంటుంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి ఆదాయాన్ని గండికొడుతూ, లీజు మొత్తాన్ని చెల్లించకుండా, ఇతర ప్రాంతాలకు జిల్లాలోని ఖనిజ నిల్వలను అక్రమంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లేఖ రాసినా.. లెక్క చేయలేదు..

ప్రభుత్వ ఆదాయానికి అనుగుణంగా, లీజు మొత్తాన్ని చెల్లించకుండా అమిగోస్ మినరల్స్ సంస్థ కాలం గడుపుతూ వస్తోంది. ప్రభుత్వానికి ఏడాది లీజు రూ.130కోట్లు చెల్లించాలంటూ...సాక్షాత్తు భూగర్భ గనుల శాఖ డీడీ మైన్స్ డైరెక్టర్‌కు గత ఫిబ్రవరి 7వతేదీన లేఖ రాశారు. దీంతో ఏడాది మొత్తం లీజు చెల్లిస్తేనే కాంట్రాక్ట్ కొనసాగించాలి...లేదంటే అమిగోస్ మినరల్స్ సంస్థ లీజును రద్దు చేస్తామంటూ, నాలుగేళ్లపాటు ఎక్కడా మైనింగ్ చేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలంటూ మైన్స్ డైరెక్టర్ నుంచి డీడీ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయంలోనే అప్పట్లో ఉన్న పెద్దమంత్రికి, అప్పటి మైన్స్ రాష్ట్ర డైరెక్టర్‌కు మధ్య మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. మైన్స్ డైరెక్టర్‌కు రావాల్సిన కమీషన్ రాకుండా పెద్దమంత్రి అడ్డుకుంటున్నారనే భావనతో వారి మధ్య అప్పట్లో బేధాభిప్రాయాలు వచ్చాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో అమిగోస్ అక్రమ వసూళ్ల పర్వం

ఉమ్మడి జిల్లాలో అగ్రిమెంట్ లీజు పేరుతో అమిగోస్ మినరల్స్ సంస్థ స్థానిక కాంట్రాక్టర్లు, ఇతరుల రవాణా దారుల నుంచి అక్రమంగా వసూళ్లకు అప్పట్లో తెరలేపారు. ఏడాది కాలంలోనే వివిధ కాంట్రాక్టర్ల నుంచి రూ.100కోట్లు వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాధిత లీజు కాంట్రాక్టర్లు జిల్లా, రాష్ట్ర మైన్స్ అధికారుల దృష్టికి అప్పట్లో తీసుకెళ్ళినా ఫలితం లేకపోవడం గమనార్హం. పలుమార్లు ఫిర్యాదులు వెళ్ళినా సాక్షాత్తు అప్పటి సీఎం, అప్పటి పెద్దమంత్రులు అమిగోస్ సంస్థను కాపాడుతూ వస్తున్నారనేది బహిరంగ రహస్యం. అప్పటి సీఎం, పెద్దమంత్రుల అండదండలతోనే ప్రభుత్వ ఆదాయానికి, జిల్లాలో ఖనిజ సంపదను కొల్ల గొట్టేందుకు అమిగోస్ మినరల్స్ సంస్థ యత్నిస్తోందనే ప్రచారం అప్పట్లో బాగానే సాగింది. స్థానిక కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తున్న అమిగోస్ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి ఎందుకు లీజు సొమ్ము చెల్లించడం లేదనేది బాధిత కాంట్రాక్టర్లు, మైన్స్ అధికారుల వద్ద వినిపిస్తున్న వాదన.

ప్రభుత్వానికి ప్రతి పైసా చెల్లించాల్సిందే

: నాగయ్య, జిల్లా భూగర్భగనుల శాఖ డీడీ



ప్రభుత్వానికి రావాల్సిన లీజు మొత్తం అమిగోస్ మినరల్స్ సంస్థ కచ్చితంగా చెల్లించాల్సిందే. బకాయిలతో పాటు ఇప్పటి వరకు లీజుదారుల నుంచి వసూలు చేసిన మొత్తం సొమ్మును అమిగోస్ సంస్థ ప్రభుత్వ ఖాతాలో జమచేయాలి. లేదంటే శాఖాపరమైన చర్యలు, ఇతర అంశాలపై ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఉంటాయి. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. రికార్డుల తరలింపు, ఇతర అంశాలపై అమిగోస్ సంస్థపై వస్తున్న ప్రచారాలకు స్వస్తి చెబుతాం. అమిగోస్ సంస్థకు సంబంధించిన ప్రతి రికార్డులు, ఫైల్స్‌ను స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అందజేస్తాం.

నూతన చట్టాలపై 22, 23 తేదీల్లో అవగాహన

- సదస్సుకు హాజరు కానున్న హైకోర్టు న్యాయమూర్తులు

: జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జూన్ 19: దేశంలో కొత్తగా అమలు చేయబోతున్న చట్టాలపై శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. బార్ అసోసియేషన్ సమావేశపు హాల్‌లో న్యాయవాదులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టాలు నేటికీ దేశంలో అమలు అవుతున్నాయన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ పాత చట్టాలను రద్దు చేసిందన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధ్యయన అనే మూడు కొత్త చట్టాలను జూలై నుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆ కొత్త చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించే ఈ అవగాహన సదస్సుకు హైకోర్టు న్యాయమూర్తులు హాజరు అవుతున్నారని, దీనికి ఉమ్మడి జిల్లాలోని న్యాయవాదులు హాజరు కావాలని కోరారు.

అన్నా.. నాకే ఇవ్వాలి..

- ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్ పోస్టులకు భారీ డిమాండ్
- గ్రామాల్లో లాబీయింగ్ మొదలు పెట్టిన ఆశావహులు
- తలలు పట్టుకుంటున్న ద్వితీయశ్రేణి నేతలు



బుక్కరాయసముద్రం, జూన్ 19: కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్ల పోస్టులకు ఆశావహుల్లో పోటీ పెరిగిపోయింది. ఎన్నడూ లేని పలు గ్రామాల్లో తమకంటే తమకే పోస్టులు ఇప్పించాలని శింగనమల నియోజక వర్గంగా టీడీపీ కార్యకర్తలు పోటాపోటీగా లాబీయింగ్ చేస్తున్నారు. ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై ద్వితీయశ్రేణి నాయకత్వానికి తలపోటుగా మారింది. ప్రధానంగా బుక్క రాయసముద్రం, నార్పల, శింగనమల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఒక్కో గ్రామంలో పది నుంచి 15 మంది పోటీ పడుతున్నారు. పోటీపడే వారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారే ఉన్నారు. రేషన్ డీలర్ల నియామకానికి కూడా ఇదే స్థాయిలో పోటీ నెలకొంది. గత ప్రభుత్వం గ్రామ వలంటీర్ వ్యవస్థ పెట్టిన విషయం తెలిసిందే. ఆ ప్రభుత్వంలో రూ.5 వేలు వేతనం ఇచ్చేవారు. కాగా ఎన్నికలకు ముందు చంద్రబాబు తమ ప్రభుత్వం వస్తే గ్రామ వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తానని, వారికి రూ.10వేలు వేతనం హామీ ఇచ్చారు. దీంతో ఇప్పుడు గ్రామాల్లో ఆ వలంటీర్ పోస్టుకూ పోటీ తీవ్రమైంది.

ఆఫర్లు ప్రకటిస్తున్న ఆశావాహులు..

నియోజకవర్గంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను దక్కించుకోవాలనే తపనతో ఆశావాహులు ద్వితీయ శ్రేణి నేతలకు ఆఫర్లు ప్రకటిస్తున్నట్లు సమాచారం. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు ఒక్కో గ్రామంలో 10 నుంచి 15 మందిదాకా పోటీ పడుతున్నారు. వారు ఆ పోస్టుకు రూ.లక్షలు ఇచ్చేందుకూ వెనకాడడం లేదు. దీనిని బట్టి చూస్తుంటే ఈ పోస్టుకు ఎంత డిమాండ్ ఉందో.. అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో అయితే వచ్చే సర్పంచ్, లేదా ఎంపీటీసీ ఎన్నికల ఖర్చు తమకే వదలేయండనీ, అంతా తామే చూసుకుంటామని కూడా హామీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. పోటీ ఎక్కువవుతుండడంతో ఆశావహులు ఎవరికి వారే... తమ రూట్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వద్దకు సైతం క్యూ కడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి తమ ప్రయత్నాలు చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు.

ఎంతైనా సరే...

బుక్కరాయసముద్రం మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో వైసీపీ నేత ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు తమ అనుచరుడికి ఇవ్వాలని, అందుకు ఎంత ఖర్చు అయినా సరే వెనకాడేది లేదని అంటుండడం మండలంలో తీవ్ర చర్చకు తెరలేపుతోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి ఆ గ్రామ పంచాయతీ నేతలు తీసుకెళ్లగా... వైసీపీ వర్గీయులకు ఇచ్చే ప్రసక్తే లేదని, ఎక్కడ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేదని ఆమె సూటిగా చెప్పినట్లు సమాచారం.

సమష్టి నిర్ణయంతోనే ఎంపిక..

ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేసే విధంగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముందుకు వెళ్లనున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం అనంతరం మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, మండల, గ్రామ నేతల సమష్టి నిర్ణయం అనంతరమే పోస్టులు భర్తీ చేస్తానని ఆమె నియోజకవర్గ టీడీపీ నేతలకు సూచించినట్లు సమాచారం. ఎక్కడైనా పోస్టులకు గ్రామ స్థాయి టీడీపీ నేతలకు డబ్బు ఇచ్చి తెచ్చు కున్నారంటే.. మళ్లీ అయినా తొలగిస్తానని హెచ్చరించినట్లు తెలిసింది. పార్టీకి చెడ్డ పేరు వస్తే సహించేది లేదని, నేతల సమక్షంలోనే పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినట్లు సమాచారం.

హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.48 లక్షలతో ప్రతిపాదనలు: ఎస్ఈ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో హెచ్చెల్సీ కాలవకు నీటి విడుదల చేసేలోగా రూ.48లక్షలతో అత్యవసర పనులు చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తుంగభద్ర ఎగువకాలవ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. అత్యవసర మరమ్మత్తు పనులపై బుధవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని కార్యాలయంలో ఇంజనీర్లతో ఎస్ఈ రాజశేఖర్ సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా హెచ్చెల్సీ 119 కిలోమీటరు వద్ద రూ.30లక్షలతో అండర్ టన్నెల్, 181కిలోమీటరు నింబగల్లు దెబ్బ తిన్న కాలవకు వద్ద రూ.10లక్షలతో మరమ్మత్తు పనులు, 112కిలో మీటరు బొమ్మనహాల్ వద్ద గండి పూడ్చివేతకు రూ.10లక్షలు మొత్తం రూ.48లక్షల పనులకు ప్రతిపాదనలు పంపామన్నారు. జూలై 20వతేదీ టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీకి నీటి విడుదల లోపు ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది టీబీ డ్యాంలో 172టీఎంసీల నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 26.368 టీఎంసీల నీరు కేటాయించారని పేర్కొన్నారు. నీటి నిల్వ, కేటాయింపుల్లో జాగ్రత్తలు పాటించి నీరు వృథా కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డిప్యూటీ ఎస్ఈ సునీల్‌నాయక్, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కోసం ఆఫీసుల వద్దకు రావద్దు..

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్19 : అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అన్ని తరగతుల సీట్లు భర్తీ అయ్యాయనీ... వాటి కోసం ఎవరూ ఆఫీసుల చుట్టూ తిరగొద్దని గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ బుధవారం ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో 6 నుంచి 10 తరగతులు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి పరీక్షలు, కౌన్సెలింగ్, మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేశామన్నారు. అయితే కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులను డీసీఓ కార్యాలయానికి వెళ్లాలని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మవద్దన్నారు. ఎంపిక చేసిన విద్యార్థుల్లో ఎవరైనా జాయిన్ కాకపోతే... ఆ సీటు మెరిట్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలన్నారు.

రైల్వే భద్రతపై ప్రత్యేక దృష్టి : డీఆర్ఎం

రాయదుర్గం, జూన్ 19: రైల్వే ప్రమాదాలను నియంత్రించేందుకు భద్రతపై ప్రత్యేక దృష్టి తీసుకుంటున్నట్లు హుబ్లీ డివిజన్ డీఆర్ఎం హర్షకరే తెలిపారు. బుధవారం ఆయన రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. తెల్లవారుజామున ప్రత్యేక రైలులో వచ్చి నాలుగు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా సిగ్నలింగ్, రైలు పట్టాల భద్రత తదితర అంశాలను పూర్తిగా పరిశీలించారు. ఇటీవల జరుగుతున్న రైలు ప్రమాదాల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతకు సంబంధించి పలు విషయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదే విధంగా సిగ్నలింగ్ వ్యవస్థ గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. లోపాలు, చేపట్టవలసిన మరమ్మత్తులు, సమస్యల గురించి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన రైల్వే స్టేషన్ భవనాన్ని పరిశీలించారు.

నూతన రైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలి

రాయదుర్గం రూరల్: రాయదుర్గంలో నూతన రైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలని రైల్వేడివిజనల్ సలహా మండలి మాజీ సభ్యుడు గుడేకోట శివకుమార్, రైల్వేయాక్షన్ కమిటీ సభ్యులు జయంతి సురేష్ కోరారు. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ రైల్వే మేనేజర్ హర్షకరే రాయదుర్గం స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తరైల్వేస్టేషన్‌ను వెంటనే ప్రారంభించాలని అందులో మౌలిక వసతులు కల్పించి, స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కదిరిదేవరపల్లి, గుంతకల్లు ప్యాసింజర్ రైలును పునః ప్రారంభించాలన్నారు. రాయదుర్గం నుంచి బళ్లారి మధ్యలో నడపాలని కోరారు. రైల్వేమేనేజర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఎం హర్షకరె

సంక్షిప్తంగా..

చిన్నారులకు కంటి పరీక్షలు

అనంతపురం టౌన్, జూన్ 19: జిల్లా ఆస్పత్రి ఆవరణంలోని డీఈఐసీ సెంటర్‌లో బుధవారం చిన్నారులకు ఉచితంగా కంటి లోపాలపై పరీక్షలు నిర్వహించారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇక్కడ వైద్యనిపుణులు శ్రీవిద్య కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తంమీద 15 మంది పిల్లలకు కంటి లోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ పిల్లలను చికిత్సల కోసం కడపకు చెందిన పుష్పగిరి కంటి ఆస్పత్రికి పంపుతున్నట్లు డీఈఐసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, మేనేజరు రజిత తెలిపారు. అక్కడ వీరికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తారన్నారు.

వైసీపీ ఉప సర్పంచ్ టీడీపీలోకి..

రాప్తాడు, జూన్ 19: మండలంలోని బొమ్మేపర్తి గ్రామానికి చెందిన వైసీపీ ఉప సర్పంచ్ అశ్వర్థప్ప టీడీపీలోకి చేరాడు. అనంతపురం నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో బుధవారం రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి సమక్షంలో టీడీపీలో చేరాడు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు

అనంతపురంరూరల్, జూన్ 19: గ్రామంలోని కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చిన్నంపల్లి గ్రామ సర్పంచు శివశంకర్ తెలిపారు. ఆ మేరకు బుధవారం గ్రామంలోని మల్లయ్య కొట్టాల, మటన్‌మార్కెట్, రమణ కొట్టాల ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌మన్ బాషా, కాంట్రాక్టర్ రామాంజినేయులు కలసి కాలనీలో పర్యటించారు. ఎక్కడెక్కడ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలో పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దండోర రమణ, ఆయాకాలనీ వాసులు పాల్గొన్నారు.

నేడు యోగా దినోత్సవంపై ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో గురువారం ఉదయం 7 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అలాగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం ఉదయం ఆరు గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలు ర్యాలీ, అంతర్జాతీయ దినోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్కేయూ రెక్టార్‌గా వెంకటనాయుడు

అనంతపురం సెంట్రల్ : ఎస్కేయూ రెక్టార్‌గా ప్రొఫెసర్ వెంకట నాయకుడు నియమితులయ్యారు. బుధవారం వీసీ హుస్సేన్ రెడ్డి ఆదేశాలతో రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీచే శారు.

ఐటీఐ ప్రవేశాలు ప్రారంభం

అనంతపురం సెంట్రల్ : ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో నిర్వహించిన తొలిరోజు విద్యార్థులు పెద్దఎత్తు తరలివచ్చారు. ఈనెల 21 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, జూన్ 19: నగరంలోని రామ్‌నగర్ పాత రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (60) మరణించాడు. రామ్‌నగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో గుజరీ సామన్లు ఏరుకుంటూ బ్రిడ్జి కిందే ఉండేవాడు. ఈనెల 17న రాత్రి గుజిరీ షాపు ఎదుటే అతను మరణించాడు. నాలుగో పట్టణ సీఐ ప్రతాప్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో ఉంచామని సీఐ తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9346010581, 9948823346 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఉపాధిలో అవినీతిపై చర్యలు తీసుకోండి

శింగనమల జూన్ 19: మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం శింగనమలలో నిర్వహించిన మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీకి రోజు కూలి రూ.600 ఇవ్వాలని... 200 రోజులు పనిదినాలు కల్పించాలని అన్నారు. అలాగే మండలంలో చాలా మంది ఉపాధి సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, వారిపైన వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు భాస్కర్, ఎర్రిస్వామి, సుంకన్న, ప్రకాశ్, రామాంజి పాల్గొన్నారు.

వనరుల వేలం పాట

నార్పల, జూన్ 19: స్థానిక పంచాయతీ కార్యాలయంలో మేజర్ పంచాయతీకి సంబంధించిన ఆదాయపు వనరులైన వారపు సంత, బస్టాండ్, సులబ్ కాంప్లెక్స్‌ల వేలం పాటలను సర్పంచు సుప్రియ, ఎంపీడీఓ రాముడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సంతమార్కెట్ వేలంను నార్పలకు చెందిన వేటూరి ప్రసాద్ నాయుడు రూ.2.64 లక్షలకు సొంతం చేసుకున్నాడు. సులబ్ కాంప్లెక్స్, బస్టాండ్ వేలం హక్కుల పట్ల ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో వాటి వేలం పాటను అధికారులు వాయిదా వేశారు.

అధిక ఫీజుల స్కూళ్లు సీజ్ చేయాలి

అనంతపురం విద్య, జూన్ 19 : జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లను వెంటనే సీజ్ చేయాలని పీడీఎస్‌యూ, పీడీఎస్ఓ, ఐసా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో ఆయా సంఘాల నాయకులు ధర్నా చేశారు. దీంతో అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్రప్రసాద్, ఇతర నాయకులు మాట్లాడుతూ.... జిల్లాలో పలు కార్పొరేట్ స్కూళ్లు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. గవర్నమెంట్ నిబంధనలకు విరుద్ధంగా లక్షలాది రూపాయలు పిండుకుంటూ.... తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోడం లేదన్నారు. అధికారులు స్పందించకుంటే... ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నరేంద్ర, బాలకృష్ణ, బాలు, నరేంద్ర పాల్గొన్నారు.

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి

అనంతపురం అర్బన్, జూన్ 19 : ఆర్డీటీ సంస్థ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 15వ వర్థంతిని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తదితరులు పూల మాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఫాదర్ ఫెర్రర్‌కు అనంత జిల్లా ఎల్లప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. కరువు జిల్లాలో పేదల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్య చౌదరి, కూచి హరి, లింగారెడ్డి, నెట్టెం బాలకృష్ణ, చేపల హరి, సురేష్ చౌదరి, వెంకటేశ్వరరెడ్డి, ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగులకు అన్నదానం

అనంతపురం టౌన్ : ఆర్డీటీ సంస్థ ఫాదర్ ఫెర్రర్ వర్థంతి సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో బుధవారం రోగులకు అన్నదానం చేశారు. సాయి సంస్థ అధ్యక్షుడు విజయ సాయి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సాయి సంస్థ సభ్యులు రాఘవ, నారాయణ పాల్గొన్నారు.



ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



చిన్మయ్‌నగర్‌లో విద్యార్థుల ర్యాలీ

బుక్కరాయసముద్రం, జూన్ 19: ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని, అప్పుడే వారికి ఉజ్వల భవిషత్తు ఉంటుందని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యాభివృద్ధికి చంద్రబాబు అనేక పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులూ బాధ్యత తీసుకుని నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు అక్షరాస్యులైనప్పుడే సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులు పిల్లలుకు నాణ్యతమైన విద్యను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ శోభ, ఎంఈఓలు లింగా నాయక్, సబిత, ఎంపీపీ సునీతా జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, టీడీపీ నాయకులు మల్లేష్, సోము, ఓబులపతి, నరేంద్రయాదవ్, సురేష్‌చౌదరి, రెడ్డిపల్లినాయుడు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

రాప్తాడు: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్‌ఎం నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది యల్లమ్మ, మాధవి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల విజేత అనంతపురం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: సౌత్‌జోన్ అండర్-23 క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అండర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ ఫైనల్ పోటీలను బుధవారం నిర్వహించారు. కడప, అనంతపురం జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 262 పరుగులు చేసింది. ఇందులో ఖాదర్‌వలీ 61, వీరారెడ్డి 50 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన కడప 34.3 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో అనంతపురం విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు 49 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 44 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి గెలుపొందింది. చిత్తూరు బ్యాటర్ ధరణికుమార్ 77 పరుగులు చేశాడు. పాయింట్ల ఆధారంగా అనంతపురం విజేతగా, ద్వితీయ స్థానంలో చిత్తూరు, తృతీయ స్థానంలో కర్నూలు, నెల్లూరు నాలుగో స్థానంలో, కడప ఐదో స్థానంలో నిలిచింది. విజేతలకు సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సెలెక్టర్లు శ్రీహరి, వెంకటేష్, నాగినికుమార్, విజయశేఖర్,మాజీ రంజీ క్రీడాకారుడు షాబుద్దీన్ పాల్గొన్నారు.



విజేత అనంతపురం జట్టు

నేటి నుంచి ఉరుసు వేడుకలు

అనంతపురం కల్చరల్, జూన్ 19 : చెరువుకట్టపై వెలసిన 'హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి' దర్గాలో గురువారం నుంచి శనివారం వరకు 140వ గంధం ఉరుసు వేడుకలు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యుడు పూల మన్సూర్ అలి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి 7.15 గంటలకు హాజీ మహబూబ్ సాహెబ్ నివాసం నుంచి గంధంను ఊరేగిస్తూ ఫకీర్ల జల్సాల నడుమ దర్గాకు చేరుకుంటారన్నారు. ఎనిమిది గంటలకు బనగానపల్లికి చెందిన డాక్టర్ సయ్యద్ షా హుసేన్ బాషాఖాద్రి నేతృత్వంలో ఫాతేహా నిర్వహిస్తామని, అన్నదానం ఉంటుందని తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామ ని, భక్తులకు పెద్దఎత్తున అన్నదానం, రాత్రి 10 గంటలకు ఖవ్వాలి పోటీలు ఉంటాయని వివరించారు. శనివారం ఉదయం మొదటి నమాజ్ తర్వాత బియారత్ ఫాతేహ నిర్వహించడంతో ఈ వేడుకలు ముగుస్తాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.



హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి దర్గా

'కరెంట్' దొంగలు దొరికేరా..?

- లంచాలు పుచ్చుకొని అనధికారికంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- ఆంధ్రజ్యోతి కథనంతో అవినీతిపై విజిలెన్స్ విచారణ
- అనధికార ట్రాన్స్‌ఫార్మర్లను దాచే పనిలో నిమగ్నం
- అవినీతి ఉద్యోగులను కాపాడుకుంటున్న అధికారులు..!

అనంతపురం రూరల్, జూన్ 19: నార్పల మండలంలో కొందరు విద్యుత్ ఉద్యోగులు అనాధికారికంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి.. తమ జేబులు నింపుకున్నారు. దీనిపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో విజిలెన్స్ అధికారులు ఈ అవినీతిపై విచారణ చేపట్టారు. దీంతో విద్యుత్ ఉద్యోగులు తమ తప్పిదాలను కప్పించుకునేందుకు ఎస్టిమేషన్లు వేసి తిరిగి వాటిని యథాస్థానంలో ఏర్పాటు చేస్తున్నారు. అంతవరకూ అనధికారికంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను దాచిపెడుతున్నారు. ఇలా దాచిన ఓ ట్రాన్స్‌ఫార్మర్ వ్యవహారం వెలుగు లోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌ను తొలగించి ఆరు రోజుల క్రితం సిద్ధారాంచెర్ల గ్రామం ఎస్సీ కాలనీ అంకాలమ్మ ఆలయ సమీపంలోని ఓ గోడ కింద ఉంచారు. విద్యుత్ ఉద్యోగే ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడ ఉంచడంతో ఎవరూ దాని గురించి ఆరా తీయలేదు. కాగా ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి ఎస్టిమేట్ వేసి తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేసేందుకు సంబంధిత ఉద్యోగులు నానా తంటాలు పడుతున్నట్లు సమాచారం. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్ల గురించి ఎవరైనా విద్యుత్ అధికారులకు తెలియజేసినా.. వారు సైతం ఆ అవినీతి ఉద్యోగులను కాపాడుకునేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



సిద్ధారాం చెర్లలో ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్

వైసీపీ సెక్రటరీపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం రూరల్, జూన్ 19: మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తూ.. అడ్డగోలుగా బిల్లులు చెల్లించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 15న వైసీపీ సెక్రటరీ అన్న శీర్షికతో ఓ కథనం ప్రచురించిన విషయం విదితమే. దీనికి జిల్లా ఉన్నాతాధికారులు స్పందించారు. ఆ కార్యదర్శిపై విచారణకు ఆదేశించారు. డీఎల్‌పీఓ సుమన జయంతి ఆధ్వర్యంలో బుధవారం ఆ అధికారులను విచారించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు పంచాయతీ కార్యాలయంలో విచారిం చినట్లు సమాచారం. పంచాయతీ కార్యాలయంలో రికార్డు పరిశీలించారు. ఆ కార్యదర్శి పనిచేసినప్పటి నుంచి బిల్లులు చెల్లింపులు, ఇతరాత వాటికి సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా పంచాయతీ పరిధిలో ఓ లేఅవుట్‌లో మాజీ ప్రజాప్రతినిధికి లబ్ధిచేకూర్చేందుకు కార్యదర్శి ప్రయత్నాలు చేసిన విషయంపై కూడా ఆరాతీశారు. ఈ క్రమంలో ఆ లేఅవుట్‌ను అధికారులు పరిశీలించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లా రైతులను ఆదుకోండి : ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూన్ 19: గతేడాది రబీ సీజన్‌లో వర్షాభావంతో పంటలు దెబ్బ తిన్న నష్టపోయిన ఉమ్మడి అనంత జిల్లా రైతులను ఆదుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కరువు బృందానికి విన్నవించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం టీం లీడర్ కేంద్ర వ్యవ సాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌహాన్‌ను కలిశారు. ఉమ్మడి జిల్లాలో రబీ సీజన్‌లో పంటనష్టంపై వివరించారు. పంటనష్టపోయిన రైతులకు పంటనష్టపరిహారం అందేలా నివేదికలు అందజేసి రైతులను ఆదుకోవాలని కోరారు.



రితీష్ చౌహాన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యం



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

అనంతపురం విద్య, జూన్ 19: మొక్కల పెంపకంతో పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గురుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కళాశాల ఆవరణంలో వంద మొక్కలు నాటారు. మొక్కల పెంపకాన్ని అందరూ బాధ్యతగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ శివప్రసాద్, సీనియర్ లెక్చరర్ ఉషాకుమారి, శాంతిబాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌కు శుభాకాంక్షలు



అనంతపురం సెంట్రల్, జూన్ 19: రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్ప, కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి రాజశేఖర్, ఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగనాథం విజయవాడలో మంత్రి లోకేశ్‌ను కలిశారు. కళాశాలల్లో నెలకొన్న సమస్య లపై మంత్రికి వినతి పత్రం ఇచ్చారు.

సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 19: సాగునీటి ప్రాజెక్టులపై జేఎన్‌టీయూ బీటెక్ ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు హంద్రినీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసే నాయక్ అవగాహన కల్పించారు. బుధవారం హెచ్చెల్సీ కాలనీలోని తన కార్యాలయంలోని చాంబర్‌లో ఈ కార్యక్ర మం నిర్వహించారు. జలవనరుల శాఖ పరిధిలోని ప్రాజె క్టులు, చెరువులు, కాలవలు, కుంటలు, చెక్‌డ్యాంలు, రిజర్వా యర్లు, గేట్లు, పంప్ హౌస్, ఎత్తిపోతల ప్రాజెక్ట్, గ్రావిటీ కాలవ, డ్యాంలు, స్పిల్‌వే, అండర్ టన్నల్, డిస్ట్రిబ్యూటరీలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. జలవనరుల శాఖ ప్రాజెక్టుల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినపుడే పూర్తిస్థాయిలో అర్థం అవుతాయన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 19: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ విద్యకు తిరిగి బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టడంపై టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక అంబే ద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో ఎస్సీలకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులుగా.. రాజారెడ్డి రాజ్యంగాన్ని నడిపించారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విదేశీ విద్యకు తిరిగి బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం శుభపరిణామన్నారు. టీడీపీ తోనే ఎస్సీలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, చంద్రశేఖర్, జూటూరు వెంకటేష్, తిమ్మరాజు,ఎర్రిస్వామి, శివ, రాజేష్, సందీప్, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం



ఎమ్మార్సీ భవనం దుస్థితి

శింగనమల : స్థానిక ఎమ్మార్సీ (మండల రీసోర్స్ సెంటర్) భవనం శిథిలావస్థకు చేరుకుంది. 20 ఏళ్ల క్రితం దీన్ని నిర్మించారు. వర్షం వచ్చినపుడు భవనం కారుతుండటంతో వైసీపీ హయాంలో ఆ కార్యాలయాన్ని స్థానిక జిల్లా పరిషరిత్ పాఠశాల అటస్థలంలో నిర్మించిన బాలికల వసతి గృహంలోకి మార్చారు. ఎంఆర్‌సీ భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో అది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. దాన్ని కూల్చి. ఆ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేద్దాం

బుక్కరాయసముద్రం, జూన్ 19: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. బుధవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీలో మలేరియా నిర్మూలన మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియాపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిం చాలని సూచించారు. ప్రతి ఒక్కరు విధిగా ప్రతి శుక్రవారం డ్రై డే తప్పని సరిగా పాటించాలన్నారు. అలా చేయడం వలన దోమలను గుడ్డు దశలోనే పూర్తిగా అరికట్టవచ్చన్నారు. అనంతరం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న అంబేడ్కర్ సాంఘిక గురుకుల వసతి గృహంలో మిలాథియం మందుతో గదులన్నీ పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఇందిరా ప్రియదర్శిని, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాజా పాల్గొన్నారు.



కొర్రపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

దారి మూసివేతపై నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్, జూన్ 19: పట్టణంలోని మస్తాన్‌పేట సమీపంలో రెడ్ ట్యాంక్ వద్ద రైల్వే ప్రహరీ మధ్యలో ఉన్న దారిని రైల్వే అధికారులు మూసివేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పేర్కొన్నారు. స్థానిక ప్రహరీ వద్ద బుధవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, విద్యార్థులతో నిరసన తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రహరీ మూసివేయడంతో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వేస్టేషన్, రైల్వే ఆసుపత్రికి అత్యవసర పరిస్థితిలో వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. అధికారులు రైల్వే ప్రహరీ మధ్యలో దారి వదలాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, మస్తాన్‌పేట కాలనీవాసులు జ్యోతి, షాషావలి, వీరేష్, బుజ్జి, గిరి, లక్ష్మీదేవి, అనురాధ పాల్గొన్నారు.

వర్షపు నీటి మళ్లింపునకు చర్యలు

- గుమ్మనూరు నారాయణ



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న నారాయణ

గుత్తి, జూన్ 19: పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ పలు వార్డుల్లో బుధవారం విస్తృతంగా పర్యటించారు. పురాతన కుంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామానుజం స్కూల్ వద్ద కాలువలో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. కాలువలో పూడికను పూర్తిస్థాయిలో తొలగిస్తే వక్కల కుంటకు కొండల మీద నుంచి వస్తున్న వర్షం నీరు వృథా కాకుండా చేరుతుందన్నారు. దీని వల్ల పట్టణంలోని బోర్లలో నీటి శాతం పెరిగి నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఇందు కోసం తగు చర్యలు చేపట్టామన్నారు. అదే విధంగా పలువార్డులలో నూతన బోర్లు ఏర్పాటు చేసి మోటర్లు బిగించి నీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. గుమ్మనూరు జయరాం ఇచ్చిన హామీలలో భాగంగా నీటి సమస్య పరిష్కారానికి పనులు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంకే చౌదరి, బోరువెల్ నాగరాజు, సుధాకర్, న్యాయవాది సోమశేఖర్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

గుంతకల్లు టౌన్, జూన్ 19: పర్యావరణంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని శ్రీ శంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కళాశాల ఆవరణంలో బుధవారం విద్యార్థులు మొక్కలు నాటారు. ఒక్కొక్క మొక్క సంరక్షణ బాధ్యతను ఇద్దరు విద్యార్థులకు అప్పగించామని ప్రిన్సిపాల్ తెలిపారు.



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 19: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీకి చెందిన కొందరు అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్నారని, వాటిని నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు సల్లాపురం బాబు, నవీన్, సంగప్ప, సైకిల్‌షాప్ హనుమంతు తహసీల్దార్ రామాంజినమ్మకు బుధవారం వినతిపత్రం అందించారు. గ్రామంలోని 500 ఎకరాల పాత మాగాణి పొలాలకు వెళ్లే దారిలో అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారని దీన్ని అడ్డుకోవాలని కోరారు. పంచాయతీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

వదిలి వెళ్లిన పిల్లలను శిశుగృహకు తరలిస్తాం

సీడీపీఓ సాజిదాబేగం



ఊయల ఏర్పాటులో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ, సిబ్బంది

తాడిపత్రి టౌన్, జూన్ 19: ఊయలలో వదిలి వెళ్లిన పిల్లలను శిశుగృహకు తరలిస్తామని సీడీపీఓ సాజిదాబేగం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఊయలను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. చట్టవ్యతిరేక దత్తతను అరికట్టడం కోసం, చట్టబద్ధమైన పిల్లల దత్తతను ప్రోత్సహించడం కోసం ఏర్పాటు చేశామన్నారు. ఊయలలో ఎవరైనా బిడ్డను వదిలివెళ్లిన వెంటనే సంబంధిత సెక్యూరిటీ సిబ్బంది చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్, డాక్టర్ సాయిచరణ్, సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, లక్ష్మీదేవి, నారాయణమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు గోరంట్లలో ఉచిత వైద్యశిబిరం

గోరంట్ల, జూన్ 19: పట్టణంలోని మాధవరాయ ఆలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామాభ్యుదయ మహిళ మండలాధ్యక్షురాలు రమాపావనిరాయల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



పంపింగ్ మోటార్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

కణేకల్లు, జూన్ 19: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం కణేకల్లు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయదుర్గం పట్టణంలో కొన్ని ప్రాంతాలకు వారానికి ఒకసారి మంచినీటి సరఫరా జరుగుతున్నట్లు పలువురు తనకు వివరించడం జరిగిందన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతుందో తెలుసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకును పరిశీలించడం జరిగిందన్నారు. ప్రధానంగా తాగునీటి సరఫరా చేసే విద్యుత్ మోటార్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరుగకపోవడంతో నీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. త్వరలోనే మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు చర్యలు చేపడతామన్నారు. టీబీ డ్యాంలో నీరు నిండాలంటే ఇంకా సమయం ఉన్నదని ప్రస్తుతం డ్యాంలో 5.58 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. టీబీడ్యాం నుంచి హెచ్చెల్సీకి నీరు విడుదల కావాలంటే కనీసం 20 టీఎంసీలు ఉండాలన్నారు. మరో 15 రోజుల తర్వాత డ్యాం నుంచి హెచ్చెల్సీ కాలువకు నీటి సరఫరా జరగవచ్చని, ఆ సమయంలో సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకుకు పంపింగ్ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, డీఈ సురేష్, ఏఈ కోదండరామ్‌తోపాటు టీడీపీ నాయకులు టంకశాల హనుమంతు, కడ్డిపూడి మాబు, భారతి, జిలాన్, పసుపులేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇక.. తాడిపత్రి అభివృద్ధి బాట..

మున్సిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

తాడిపత్రిటౌన్, జూన్ 19: నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తుందని మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం అన్నారు. జేసీ అస్మిత్‌రెడ్డిని గెలిపించినందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంతో పట్టణంలో కొన్నిరోజులుగా అండర్‌డ్రైనేజీ వ్యవస్థలో సమస్య నెలకొందన్నారు. ఎస్టీపీ-1, 2ల వద్ద దాదాపు రూ.80లక్షలతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి బినామీలు నాసిరకంగా పనులు చేపట్టారన్నారు. దీంతో మరోసారి పైపులు పగిలిపోయి సమస్య తీవ్రతరమైందన్నారు. కొన్నిరోజుల్లోనే ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధిపై దృష్టి సారిస్తారన్నారు. సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు రేష్మాపర్వీన్, అరుణ, సురేష్, సుశీలమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

సచివాలయంలో సీఎం, నాయకుల ఫొటోల ఏర్పాటు

కళ్యాణదుర్గం, జూన్ 19: మండలంలోని బోరంపల్లి గ్రామం వైసీపీకి కంచుకోటగా వుంది. అలాంటి కంచుకోటలో టీడీపీ హవా సాగింది. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్‌లలో నాయకుల ఫొటోలను ఏర్పాటు చేశారు. దివంగత ఎన్టీరామారావు, సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఫొటోలను ఆ గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షుడు చాకలి వెంకటేశులు, బూత్ కన్వీనర్లు యర్రిస్వామి, మల్లయ్య, సీనియర్ నాయకులు మారెప్ప, రామాంజినేయులు, ఆధ్వర్యంలో ఫొటోలను ఏర్పాటు చేశారు.



బోరంపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన నాయకుల ఫొటోలు

ఫాదర్ ఫెర్రర్‌కు ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్

కుందుర్పి/యాడికి/ఉరవకొండ, జూన్ 19: మండల కేంద్రంలో ఫాదర్ ఫెర్రర్ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి హాజరయ్యారు. ముందుగా ఫాదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ ఫాదర్ అందరివాడన్నారు. అనంతరం మొక్కలను నాటారు. అదేవిధంగా మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ సంస్థ డైరెక్టర్లు నిర్మల కుమార్, సాగరమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, దశరథ్, మల్లారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా యాడికిలో విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఉరవకొండ మండలంలోని లత్తవరంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంరూరల్, జూన్ 19: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కేపీ లింగమయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని స్టోన్‌వ్యాలీ స్కూల్‌లో ఫైర్ సర్వీస్ అవేర్నెస్‌పై కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా తప్పించుకోవాలి..? ఎలా మంటలను ఆర్పాలి..? తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం.. కేసు నమోదు

యల్లనూరు, జూన్ 19: మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో విలేజ్‌క్లినిక్ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పగలగొట్టడంతో కేసు నమోదుచేశామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాత్రి 8గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు

గ్రామంలో నెలకొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని భద్రతా చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

కళ్యాణదుర్గం, జూన్ 19: మండలంలోని ఓ గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై 16 యేళ్ల బాలుడు అత్యాచారానికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి బాలికను తీసుకురావడంతో వెలుగుచూసింది. సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో బాలికకు పండు ఇస్తానని చెప్పిన బాలుడు గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. విషయం ఎవరికైనా చెబితే కొడతానని ఏడుస్తున్న బాలికను బెదిరించాడు. బాలికను తల్లి అడగటంతో విషయం చెప్పింది. ఆమె భర్తతో కలిసి వెళ్లి బాలుడిని నిలదీసింది. బాలికను మంగళవారం రాత్రి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడి నుంచి ఇతర పరీక్షల నిమిత్తం అనంతపురం తీసుకెళ్లారు. మంగళవారం రాత్రే డీఎస్పీ శ్రీనివాసులు ఆస్పత్రికి వెళ్లి, ఘటనపై బాలిక తల్లిదండ్రులతో వివరాలు ఆరాతీశారు. పూర్తి వివరాలు వైద్య పరీక్షల అనంతరం తెలుపుతామని ఆయన వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం



వజ్రకరూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉరవకొండ, జూన్ 19: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు, కొనకొండ్ల, వజ్రకరూరు గ్రామాల్లో మలేరియా మాసోత్సవాలలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా సిబ్బంది ఇంటింటికీ ఫీవర్ సర్వే చేపట్టారు. ఉరవకొండ మండలం మోపిడి, చిన్నముష్టూరు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గురుప్రసాద్, నాగరంగయ్య, షఫీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోండి..

గుంతకల్లు టౌన్, జూన్ 19: తమను విధుల్లోకి తీసుకోవాలని రాజీనామా చేసిన వలంటీర్లు కోరారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి తమతో రాజీనామా చేయించారన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో గుమ్మనూరు నారాయణను కలిశారు. వారు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వస్తుందని తమతో రాజీనామా చేయించారన్నారు. తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం చేయాలని గుమ్మనూరు నారాయణకు వినతిపత్రం అందజేశారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి

గుత్తి, జూన్ 19: స్థానిక కోర్టులో ఈనెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయసేవా సమితి చైర్మన్, ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథ్ సూచించారు. స్థానిక కోర్టు హాల్‌లో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ ఎపీఓ బిల్లు, ఎన్ఐయాక్ట్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ గంగాధర్, శ్రీనివాసులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపు హర్షణీయం



మాట్లాడుతున్న సమితి నాయకులు

గుంతకల్లుటౌన్, జూన్ 19: ముఖ్యమంత్రి చంద్రబాబు దివ్యాంగులకు సామాజిక పింఛన్ పెంచడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎల్లిపాయల ఆనంద్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పద్మ, శ్రీనివాసులు, సురేంద్ర, జగ్గలిమారెన్న, వల్లి, అంజి, ఉష, నరసమ్మ పాల్గొన్నారు.

అరటి మొక్కలను తొలగించిన దుండగులు

- పోలీసులకు ఫిర్యాదు



అరటి మొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

యాడికి, జూన్ 19: పెద్దపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అరటితోటలో 70అరటి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది.
పెద్దపేట గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తన వ్యవసాయ తోటలో అరటి సాగు చేసింది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 70 అరటిమొక్కలను భూమిలో నుంచి తొలగించి అక్కడే పడేశారు. బుధవారం ఉదయం తోటవద్దకు వెళ్లిన లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు వాటిని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తోటవద్దకు వెళ్లి మొక్కలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మీదేవి వైసీపీలో ఉన్నారు. సమాచారం అందుకున్న మాజీ జడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి తొలగించిన అరటిమొక్కలను పరిశీలించారు. రైతులతోటల్లో అరటి మొక్కలను తొలగించడం దుర్మార్గపు చర్య అని తెలిపారు. నిందితులను గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాని ఆయన కోరారు.

మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన ఎంపీ పార్థసారథి

ఉరవకొండ, జూన్ 19: ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను హిందూపురం ఎంపీ పార్థసారథి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



అడ్మిషన్లు ప్రారంభం: ప్రిన్సిపాల్

రాయదుర్గంరూరల్, జూన్ 19: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ రఘురామమూర్తి తెలిపారు. బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్టులు ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, మైక్రో బయాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బాటనీ నందు కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్‌స్థాయిలో అన్ని హంగులతో డిగ్రీ కోర్సులు చదవడానికి అనువైన ప్రశాంతమైన వాతావరణం కళాశాలలో ఉందన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు కళాశాలను సందర్శించి దరఖాస్తు పొంది పూర్తి చేసి కళాశాలలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 9030260294ను సంప్రదించాలన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాము ఎదురుగా ఉన్న శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు అల్లీపీరా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, హెచ్‌ఈపీ, బీకాం సీఏ, ఎంపీసీఎస్ కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడిపత్రిటౌన్, జూన్ 19: స్థానిక ఆర్టీసీడిపోలో గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలను 9959225856 నెంబర్‌కు ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

ప్రతికూలీకి పనులు కల్పిస్తాం: ఎంపీడీవో

కుందుర్పి, జూన్ 19: జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకు పని కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలలో కూలీలకు పనులు కల్పించి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఏ ఒక్కరు వలసలు వెళ్లకుండా పనులు కల్పించడం జరుగుతోందన్నారు.

బెళుగుప్ప: ఉపాధి హామీ పథకం కింద ప్రతి కూలీకి పని కల్పించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సుబ్బరాజు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకంపై ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ పనులను చూపాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

బెళుగుప్ప, జూన్ 19: మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు వైద్యశిబిరం

బొమ్మనహాళ్, జూన్ 19: పశువులు ఆరోగ్యవంతంగా ఉండి సరైన సమయంలో ఎదకు వస్తే పశుసంపద పెరిగేందుకు అవకాశం ఉంటుందని జిల్లా పశుగనాభివృద్ధి అధికారి డాక్టర్ టీవీ సుధాకర్ అన్నారు. బుధవారం బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో పశువులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కేసు నమోదు

పుట్లూరు, జూన్ 19: మండలంలోని గాండ్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి కొందరు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తలారి నారాయణస్వామిపై కేసు నమోదుచేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. మద్యం తాగి వీధిలో ఉన్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడాడన్నారు. అదేవిధంగా ఇంటి కాంపౌండ్ గోడకు ట్రాక్టర్‌తో తగిలించి పడగొట్టినట్లు తలారి గోపాల్ ఫిర్యాదుచేశాడన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

- ఒకరికి గాయాలు

గుంతకల్లుటౌన్, జూన్ 19: పట్టణంలోని ఆలూరు రోడ్డులో బుధవారం ద్విచక్రవాహనాన్ని బొలెరో ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఆంజనేయులు చిప్పగిరిలో పెయింటింగ్ పనిచేసి గుంతకల్లుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. ఆలూరు రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద రోడ్డు దాటుతున్న ఆంజనేయులును గుంతకల్లు నుంచి చిప్పగిరికి వెళ్తున్న బొలెరో ఢీకొంది. ప్రమాదంలో ఆంజనేయులు కాలు విరిగింది. గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించాలని వైద్యులు సూచించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

గుంతకల్లుటౌన్, జూన్ 19: మండలంలోని ఓ గ్రామానికి చెందిన సూర్యనారాయణపై ఎస్సీ, ఎస్టీ, లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు. సూర్యనారాయణ ఓ మహిళను గత కొన్ని రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఆ మహిళ ఇంట్లోకి చొరబడి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత మహిళ, ఆమె భర్త బుధవారం రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, లైంగిక వేధింపులు, ఇంట్లోకి చొరబడిన కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.